వారం వారం కథాప్రభ

# కలియుగ కృష్ణార్జునులు

పులిగడ్డ విశ్వనాథ రావు


**"ఒరేయ్ బామ్మర్దీ! మన పని ఎలా సెక్కబెట్టుకోవాలంటే మనదొక సిల్లిగవ్వ కాని, ఒక్క నోటి మాటగాని కర్సు అవకూడదు. మన పని మటుకు దిగ్గజయంగా బీహార్‌లో రిగ్గింగులా సాగిపోవాల" అన్నారు చాముండేశ్వర రావుగారు బావమర్ది సంపత్‌తో గీత బోధ చేస్తున్న కృష్ణుడి పోజులో.**

"మరి, బావా, వాళ్లు నన్ను కంపెనీలో డైరెక్టరుగా వేసుకున్నారు కదా? వాళ్ల పని నువ్వు చేసి పెట్టాలా, లేదా?" అని సంపత్ అడిగాడు.

"నీకు కంపెనీలో భాగం ఇచ్చినారా ఆళ్లు? నేదు కదా? పేదోడు బతికుంటే వోటు యేత్తాడు కాబట్టి ఆడికి సవకగా బియ్యం ఇచ్చి ఆడి పేణాలు నిలబెట్టినట్టు నీకు జీతం రాళ్లే పారేత్తున్నారు. అయి నీకు ఎలాగూ దొరుకుతయి, తెల్సిందా? మరి నీకు కంపెనీలో భాగం ఇచ్చి ఉంటే మంతిరి గారికి, ముక్కెమంతిరి గారికి సెప్పో, సచ్చో ఆళ్ల పని సేయిద్దును."

"మరి వాళ్ల పని అవకపోతే?"

"నీ తెలివి తెల్లారినట్టే ఉంది రా, బామ్మర్దీ! ఎమ్.ఏ., ఎల్.ఎల్‌బి. సదివి నువ్వు నేర్చుకున్నది ఇదేనా? ఔనులే, కాలేజీలో లౌకికగ్నానం సెప్పరు



కదా? నాను కాలేజీ కాదు కదా, ఈది బడి తప్ప స్కూలు మొహం కూడా సూడనేదు. కాని యావారిక గ్నానంలో నా ముందు ప్రొఫెసర్లు, బారిస్టర్లు అంతా బలాదూర్."

"ఔను, అది ఒప్పుకోక తప్పదు. నువ్వు ఎలెక్షన్లలో ఓడిపోయినా మంత్రి హోదాగల ఓ కమిటీ చేయిర్మన్‌గిరీ చేపట్టి, బంగళా, కారు, బంట్రోతులు, పి.ఏ. అన్ని హంగులు అనుభవిస్తున్నావంటే అది నీ సాటిలేని లౌకిక జ్ఞానం మూలంగానే

3-7-96C2.EPS



కదా?"

"సక్కగా సెప్పినావు. ఐతే నువ్వు కూడా నేర్సుకోకూడదా ఈ సదరంగపు ఎత్తులు, పొత్తులు?"

'నా కా బుర్ర ఉంటేనా? ముందు ఈ ప్రశ్నకి జవాబు చెప్పు, బావా? మా కంపెనీ వాళ్ల పని అవకపోతే నేనేం జవాబు చెప్పాలి?'

'సెప్తా సెప్తా. కాని ముందు మన రొంటిలోంచి ఒక సిల్లగవ్వ కాని ఒక్క నోటి మాటకాని కర్సవ కుండా ఎలా మనం పబ్బం గడుపు కోవాలో ఒక కద సెప్తా యిను. ఇది నారాయణరావు కద. దీంట్లో నీకు నీ పెస్నకి సమాధానం దొరుకుద్ది.'

"మన పేదరికం నిర్మూలన నిధికి పది లక్షల విరాళం ఇచ్చిన నారాయణరావేనా ఈ కథకి నాయకుడు?"

"ఆఁ. ఆడే. నాకు ఆడు పరిసయం ఐంది ఈ మద్దనే. మన ఊరులో పార్కుని అంతా సెత్తలేసే జాగాగా ఆడేవోరు కదా. దాన్ని సెత్తల పార్కని అనేవోరు కూడా. ఆడ ఓ పబ్లిక్ మీటింగ్ సేసి ఆ పార్కుసి గాంధీ పార్కు అని నామకరనం సేసినా, గుర్తుందా?"

"ఉండకేం, బాగా ఉంది. గాంధీ విగ్రహం స్థాపన సమితి ట్రెజెరర్‌ని నేనే కదా?"

గాంధీ పార్క్ అంటే గాంధీ బొమ్మ కూడా ఉండాలని మీటింగ్‌లో అన్నా కదా? ఆ మీటింగ్‌లో డబ్బున్న లోకల్ ఆసామీ కదా అని మనోళ్లు నారాయణరావుని కూడా లాక్కొచ్చి ఏదిక మీద కూకొబెట్టినారు. ఆడు తగుదునమ్మా అని లేసి ఆ బొమ్మని తన కర్సుతోనే ఎట్టిత్తానన్నాడు.

"నాకు మాత్తరం సెడ్డ సికాకేసింది, బామ్మర్ది. ఈడి కడుపు మాడ. నానేదో సెందాల పేరు సెప్పి



నాలుగు డబ్బులు పోగుసేసి దాంట్లో కాస్తో కూస్తో బొమ్మకి కర్సెట్టి మిగతాది గాంధీజి పెసాదంలా ఉంచుకుందావని అనుకుంటూంటే ఈ యెదవ హవాలా పానకంలో సి.బి.ఐ దర్యాప్తు పుడకలా ఊడి పడ్డాడని శానా బాధపడ్డా. నాను సబలో ఎంటనే లేసి, 'నాయనలారా! మనం ఒక పెద్ద మడిసి ఇచ్చిన ధర్మంతో గాంధీజీ ఇగ్రహం తాపించి, ఆయనకి అన్నేయం సేయకూడదు. ఇగ్రహం తాపనలో మనందరికీ బాగస్వామ్యం ఉండాల... అందుకు సెందాలు సేకరించి ఇగ్రహం ఎట్టిద్దాం. కావలిత్తే నారాయణరావు ఓ పెద్ద మొత్తం యిరాలంగా ఇవ్వొచ్చు'' అన్నా.

"నాను అన్న మాటలకి ముందు కూకున్న నా బజంతరీగాళ్లు సప్పట్లు కొట్టి "భేష్, భేష్'' అన్నారు. దాంతో మిగతా అంతా సెప్పట్లు కొట్టి 'వహ్వా వహ్వా' అని ఒంత పాడారు. ఆ తర్వాత నిన్ను గాంధీ ఇగ్రహ తాపన సమితికి ట్రెజరర్ సేయించడం, సెందాలు సేకరించడం, గాంధీజీ మట్టి భొమ్మ ఎట్టించడం నీకు తెల్సు కదా?''

"తెలుసు, బావా! దాంట్లో మనకి గాంధీజీ ప్రసాధం బాగా మిగిలిందిలే.''

"నాభం నేందే మనం ఏ పనైనా సేత్తాంవా, బామ్మర్దీ? మనలాంటోళ్లే కాబోలు బావిలో పడ్డా యెవరు కాపాడడానికి రానేదట. ఈడు నాభం నేందే బావిలో కూడా పడడు అని ఊళ్లో అంతా ఊరుకున్నారట. సరే, ముందు నారాయణరావు కద యిను, ఆ మీటింగైన కొన్ని రోజుల తర్వాత నారాయణరావు నన్ను కల్సుకోడానికి ఒచ్చినాడు.

"ఆ ఒచ్చింది నాకు సేతిలో గలగలా డబ్బు పోయడానికి కాదు. ఏదో సొంత నాభానికే ఒచ్చి ఉంటాడని పసిగట్టేసినా. ఇలాటి మడుసుల కోసం నాకాడ ఓ ట్రాజడీ ఉందిలే.''

"ట్రాజడీ కాదు, బావా. స్ట్రాటజీ - అంటే పన్నాగం.''

"ఆ మాటే పలకలేనురా, బామర్ది. నోరు తిరగదు. ఆఁ, ఆ పన్నాగం ఏటంటే ముందు ఇలాంటి మడుసులని యిడిపించుకునే పెయత్నం సేయాల. ఆ పనిలో నా పి.ఏ సెక్రపాణి ఆరితేరి నోడులే. ఆడు ముందు ఫలానా మడిసి ఒచ్చినాడని నా సెవిలో యేత్తాడు. నాను, "ఆడికి బుద్ధి నేకపోతే నీకేనా నేదా, సెక్రపాణీ? ఏదో సెప్పి సాగనంపు'' అంటా.

"మరి సెక్రపాణి నాను ఇంటిలో లేనని సెప్పనేడు. ఎందుకంటే బైట కారు, డ్రైవరు, జవాన్లు నాను ఇంట్లోనే ఉన్నానని కొట్టొచ్చినట్టు సాటుతున్నాయి. అయ్యగారు తొంగున్నారంటే అన్ని కబుర్లు సెప్పి నాయకులు గారు పట్ట పగలే కుంబకరుణిడిలా గుర్రెడుతున్నారని ఆ ఎదుట మడిసి అనుకోవచ్చు. నిన్ను కల్సుకోరు, ఫో అని అని అనడానికి కూడా ఈలు నేదు. పెజా సేవకులం కదా. పెజలకి మాం పొగరుబోతులం అనే భావం కలగకూడదు.

"ఇయన్నీ ఆలోచించి, 'అయ్యగారు కొత్త బిజీగా ఉన్నారండి. తంవరు ఒచ్చినట్టు ఆయనకి మనవి సేయడానికి ఈలు నేకపోనాది. పెస్తుతానికి చమించండి'' అని సెక్రపాణి ఆ మడిసితో అంటాడు. దాంతో ఆ మడిసి నాబం నేదు, తర్వాత సూసుకుందాంవని ఎల్లిపోతాడు. కాని ఆడే మొండిగటం అయితే అలాగే కూకుంటాడు.

"నారాయణరావు కూడా మొండి గటంవే. అలానే కూకున్నాడు. నేను భోం చేసి, బ్రేవ్‌మని తేన్చి, తొంగొని ఆఫీసుకి పోవడానికి బైటకు ఒచ్చినా - నారాయణరావు ఎదురొచ్చాడు. 'అయ్యో, నువ్వటోయ్, నారాయణరావు! ఇదే రాకా?' అని అడిగానా. 'నేదండి, మూడు గంటలయింది మీ కోసం ఎదురు సూత్తున్నా. తంవరు బిజీగా ఉన్నారని పి.ఏ.గారు సెప్పినారండి' అని అన్నాడు.


"ఈ సెక్రపాణికి బుద్ధి నేదోయ్. ఉత్తసుంట. 'ఏం, సెక్రపాణి, నీకు మతుందా, నేదా? నారాయణ రావు ఒచ్చినాడని ఎందుకు సెప్పినావు కాదు?' అని సెక్రపాణికి సీవాట్లు ఎట్టినా.

"సెక్రపాణి పిల్లలు కలోడు. ఉజ్జోగం ఒదులు కోలేడు కదా? అందువలన తప్పు సేసినోడిలా మొగం ఎట్టి సీవాట్లు తిన్నాడు. తర్వాత నాను నారాయణరావు బుజం మీద సేయేసి 'ఆం, సెప్పవోయ్. యేంటి యిసేసం?' అని అడిగినా. 'ఏం సెప్పడం, సార్. నా కంట్రాక్టు రద్దు సేసినారు' అని యిచారంగా అనినాడు. అసలు యిసయం ఏటో సెప్పమన్నా.

"కంట్రాక్టు గడువు ఎన్ని తూర్లు పొడిగించినా కూలీల యూనియన్ గొడవల్లో పడి కంట్రాక్టు పని పూర్తి సేయనేక పోయాడట. దాంతో కంట్రాక్టు రద్దయిందట. నన్ను కంట్రాక్టు మళ్లా ఇప్పించమని బతిమాలినాడు. నాను ఆలోసించినా. నా పాత సిట్కా ఉందిగా. దాన్ని బట్టి ఓ మహజరు రాసి మంతిరిగారికి అందజేయమన్నా. 'రేపు దాని కాపీ మటుకు ఒట్టుకొచ్చి నాకివ్వు. తర్వాత పని నే సూసుకుంటా' అనినా.

"ఈలోగా దర్యాప్తు సేసినా, నారాయణరావు ఏ కంట్రాక్టు పని పూర్తి సేయడని, అన్ని కంట్రాక్టులు ఆరిబిట్రేసనుకి, కోర్టులకి యెలతాయని తేలినాది. కంట్రాక్టరుగా ఈడికి మంచి పేరు నేదట. ఈడి కేసుని నాను సిఫారసు సేసినానంటే నాకు పలుకు బడి కాస్తా మంటగలుస్తాది. కాని ఆడు మోతుబరి. ఆడిసేత ఎలచ్చన్లో మదుపు ఎట్టించ వచ్చు. అడపాతడపా పాలసార కల ఆవుని పిండినట్టు పిండొచ్చు. అందుకని ఆడిపని నాను సేత్తునట్టు కనబడాల. కాని నా నోటి మాట కూడా కర్సవకుండా ఉండాల.

"మర్నాడు నారాయణరావు మహజరు కాపీ ఒట్టుకొచ్చి నాకిచ్చినాడు. 'మహజరు మంతిరిగారికి ఇచ్చినావా?' అని అడిగినా. 'ఆఁ, ఇచ్చినా' అన్నాడు.



అప్పుడు ఆడి బుజం తట్టి, 'నారాయణరావు! నీ మహజరు నేను సాయంగా మంతిరిగారికి ఇచ్చి, నీ పని తప్పక సేసి పెట్టాలని బతిమాలతా. నువ్వు నిచ్చితంగా ఉండు,' అనినా. దాంతో ఆడు ఉబ్బితబ్బిబ్బయి తన పని అయిపోయినట్టే మురిసిపోయినాడు.

"అప్పుడు మహజరు కాపీని పి.ఏ. సెక్రెపాణి కిచ్చి, 'జాగరత్తగా ఉంచు,' అనినా. ఆడికి అలాటి దరకాస్తులు, మహజర్లని ఏంసేయాలో బాగా తెల్సు. దాన్ని ఆ కోవకు సెందిన కాగితాల ఫైలులో బద్దర పరిసి, అలమరలో ఉంచి తాళం ఏసినాడు. దాని పెయాణం దాంతో సరి. ఒచ్చే ఏడాది అది బైటపడి ముక్కలయి అగ్గిపాలవుతది."

"బావా, ఆ మహజరుని విచారించాం కాని ఈ విషయంలో యేం చేయలేమని తెలుపుతున్నందుకు చింతిస్తున్నాం అని ప్రభుత్వ శాఖ నుంచి నారాయణరావుకి జవాబు అందితే ఏం చేస్తావు?"

"ఆం, బాగా అడిగినావు, బామ్మర్దీ. ఆ జవాబు అందుకుని నారాయణరావు నా కాడకు ఒచ్చి ఇలా ఎందుకయింది అని అడుగుతాడనుకుందాం. అప్పుడు నాను, 'బాబూ, ఏం సేసేది? నేనెంతో పెయత్నించినా. మంతిరిగార్ని కల్సుకుని కాళ్లా ఏళ్లా పడినా. ఆయన అలాగే సేసి పెడతానని అన్నాడు. కాని మొన్న కల్సుకున్నప్పుడు, 'ఏం సేసేదోయ్, చాముండేశ్వర్రావు! డామ్ సేయర్మెన్ ఈలు కాదని పట్టు పట్టినాడు.' అని మంతిరిగారు సెప్పినారని తప్పించుకుంటా.

"అలా కాకుండా మీ మహజరుని యిచారించాం. మీ కంట్రాక్టుని మీకు తిరిగి ఇయ్యాలని నిర్నయించినందుకు సంతోసిత్తున్నాం అని నారాయణ రావుకి పెబుత్వ శాక నుంచి ఉత్తరవు అందిందనుకో. అప్పుడు ఆడు 'ఇదంతా మీ సలవ' అని సెప్పి నాకు ఓ బ్రీప్ కేస్ అందజేత్తాడు. ఉత్తిపున్నేనికి మనకి కనక ఒర్సం కురుత్తది కదా. మరి అలాగే అయింది కూడా.

"ఎలా అంటే మంతిరిగారు నారాయణరావు మహజరుని కింద అదికార్లకి పంపినారు. ఆళ్లు అన్ని యిసయాలు యిచారించి రిపోర్టు ఇచ్చినారు. దాని బట్టి రెండు పాయింట్లు నారాయణరావు పచ్చంలోకి ఎల్లినాయి. ఒకటి, ఆలస్సెంగా సేసినా నారాయణరావు సేసిన కంట్రాక్టు పని శానా పకడ్బందీగా ఉంటదని పేరుంది. రెండు, యిప్పుడు పని మరొక కంట్రాక్టురికి ఇత్తే, నారాయణరావు కోరిన గడువు కంటే ఎక్కువ టైము పడతది. కర్సు కూడా ఎక్కువ అవుద్ది. అందు ఒలన కంట్రాక్టు నారాయణరావుకే తిరిగి యివ్వడం మేలని, ఈసారి నారాయణరావు గడువులోనే పని పూర్తి సేత్తానని పూచీ కత్తుతో సహా హామీ యివ్వాలని మంతిరిగారు ఆదేసించినారు.

'నారాయణరావు క్లబుల్లో పేకాట ఆడుకుంటూండగా ఆడి మేనేజరు ఆండ్రివ్స్ ఈ శుభవార్త ఆడిసెవిలో యేసినాడట. నారాయణరావు యెంటనే నాకు ఫోను సేసి, 'ఇదంతా తంవరి సలవే, సార్. ఇదిగో యిప్పుడే ఒచ్చి నా కృతగ్గత తెల్పుకుంటా' అనినాడు. 'దానికేం, నారాయణరావు నా పెయత్నం నాను సేసినా. అది పలించి నీ కంట్రాక్టు నీకు దక్కింది. నాకు శానా సంతోషంగా ఉందోయ్' అనినా.

"నారాయణరావు హుటా హుటిన ఒచ్చి డ్రాయింగ్ రూమ్‌లో కూకున్న నా కాళ్ల మీద పడినాడు, ఆవేశంతో. 'అదేటోయ్, నారాయణ రావు, నీకు కాకపోతే నాను మరెవరికి సాయం సేత్తా. ఈపాటి దానికే నా కాళ్లమీద పడాలా,' అని ఆడిని లేవనెత్తినా.

"ఆ తర్వాత మీ అక్కని కాఫీ ఒట్టుకురమ్మన్నా. ఆమె కాఫీ తీసుకొచ్చినాది. ఆమెకు నారాయణ రావుని పరిసయం సేసినా, మీ అక్క - 'ఔను, నారాయణరావుగారు. మీ యిసయం ఈయని నాకు సెప్తాండేవారు. ఇయాల నారాయణరావు యిసయంలో నాను మంతిరిగారిని కల్సుకోవాల. బేగిపోవాల, జోగులు' అంటూండే వారు. మీ పని అయిందని తెలిసాక ఎంత సంబరపడిపోతున్నారో సెప్పలేననుకో' అంది.

"అక్కయ్యగారు, ఇదంతా బావగారి సలవే. మీరు నను 'మీరు' అని మన్నించ నవసరం నేదు. మీ తమ్ముడినే కదా' అని మీ అక్కతో ఒరస కలుపుకుని ఆమెకు ఒక బ్రీఫ్‌కేస్ అందించినాడు. 'ఇదేటి?' అని అడిగినా. 'ఏం నేదు, బావగారూ! మీరు నాకు అంత ఉపకారం సేసినారు కదా. దానికి కృతగ్గత సెప్పుకుంతున్నా' అనినాడు. 'ఎంత ఉంది?' అని అడిగినా. 'పది లచ్చలు, బావగారు' అనినాడు.

"నీ అసాధ్దం కూలా. ఇదేం తెగులు నీకు, నారాయణరావు? నానేం లంచాలు ఉచ్చుకునే బాపతు అనుకున్నావా? ముందు ఈ డబ్బు దూరంగా ఉంచు' అని అరిసినా. అప్పుడు మీ అక్క, 'పాపం మీ యందు బక్తి కొద్ది ఇచ్చినాడు. మీరు తీసుకోకపోతే పేదరికం నిర్మూలన నిదికి యిరాళంగా యిచ్చేయమనండి,' అంది.

"సరే నారాయణరావు. ఆ డబ్బు మా బామ్మర్ది సంపత్‌కిచ్చి ఆడికాడ రసీదు తీసుకో. ఆడు పేదరికం నిర్మూలన నిదికి కోశాద్యచ్చుడు, అనినా."

"ఔను, బావా. నారాయణరావు అలాగే బ్రీఫ్‌కేస్ నాకిచ్చి రసీదు తీసుకున్నాడు."

"సూసినావా? నారాయణరావు ఆ డబ్బుని మనకి డైరెట్‌గా ఇచ్చినాడని ఎవురికీ సెప్పనేడు. అంతే కాక తర్వాత ఏ దర్యాప్తు గట్రా జరిగినా నారాయణరావు ఆ డబ్బుని మన పేదరికం నిర్మూలన నిదికి ఇచ్చినాడని తేలుతుంది. ఎవక్కీ ఎవురు ఏంవనుకున్నా మనం పబ్లిక్‌గా నిజాయితీ పరులుగానే సెలామణి అవుతాం."

"ఆ డబ్బుని మాత్రం తప్పక పేదరికం నిర్మూలించడానికే ఉపయోగపడుతుంది కదా? ఎవరి పేదరికం ఐతేనేం? పోతే, నా సంశయానికి సమాధానం దొరికింది, బావా! మా బావకి చెప్తా, ఆయన మీ పని తప్పక చేసి పెడతాడని నేను మా కంపెనీ యజమానులకి చెప్పాలి, అంతేగా? దాని మానాన్ని అదే పని అయితే ఆ ఘనత మనకే చెందుతుంది. లేకపోతే చేయవలసిన ప్రయత్నం చేశాడు మా బావ. కాని పని అవలేదు. అది మీ ప్రాలబ్ధం అని చెప్పాలి."

"అద్గదీ. పాటం బాగా నేర్చినావు, బామ్మర్దీ. నీకెప్పుడు సంశయం ఒచ్చినా నా సెరణు రా. నీకు కనుయిప్పు కలుగద్ది" అన్నారు చాముండేశ్వర రావుగారు మందహాసంతో గ్లాసులో బుడ్డి తిరగేస్తూ.

●

